క్లుప్తంగా

మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలపై దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అర్జున్

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 16, 17 తేదీల్లో కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేయనున్న 48 గంటల నిరసన దీక్షలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు.

సమావేశంలో పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. గెలిచాక హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. నెలల తరబడి పెండింగ్ బిల్లులు రాకపోవడంతో, కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద చేయనున్న నిరసన దీక్షలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమారి, మంగ, సత్యావతి, సుగుణ, కృష్ణవేణి, ఆమని, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి చేస్తున్న భూమిపూజలో నాయకులు, అధికారులు, వైద్య సిబ్బంది

ములకలపల్లి: మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు మంగళవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు అసౌకర్యం కలుగకుండా రూ.7 లక్షల వ్యయంలో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పీఆర్ ఏఈ సురేష్, మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, భూక్యా పత్తీలాల్, నాయకులు బడకం చిరుమప్ప, సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మిన మబ్బులతో బెంబేలు

- కల్లాల్లో ఆరబోసిన ధాన్యం
- వడ్ల రాశులతో కిక్కిరిసిన కొనుగోలు కేంద్రాలు
- ఆలస్యమవుతున్న కొనుగోళ్లు.. వర్ష సూచనలతో రైతుల ఆందోళన



ఎగుమతి చేయకుండా ఉన్న ధాన్యం



గోపాలరావుపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల రాశులు

పినపాక: తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఇది రైతులకు కొంత ఊతం ఇచ్చినప్పటికీ వాతావరణ పరిస్థితులు వారిని ఆందోళనలో నెట్టేస్తున్నాయి. ఇప్పటికే పలు చోట్ల వరి కోతలు ముగిశాయి. ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మాలన్నా.. బోనస్ పొందాలన్నా.. ప్రభుత్వ నిబంధన మేరకు తేమ శాతం సరిచూసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పంటను ఆరబోసి అమ్ముకుందామనుకుంటున్న రైతులకు ఆకాశంలో మబ్బులు ఆందోళనకు గురిచేస్తుంది.

అకాల వానలతో అన్నదాతల గుండెల్లో గుబులు మొదలైంది. ఆరుగాలం కష్టించి పంటసాగు చేసుకునే రైతన్నను అమ్ముకునే సమయంలో కష్టాలు వెంటాడుతున్నాయి. పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో రాశులు పోసి సూర్యుడి కోసం ఎదురు చూస్తున్నారు. వర్షంతో ధాన్యం తడిసిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకున్నా ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌తోనైన ఊరట కలిగిస్తుందనుకున్న రైతులు అసలు పంట అమ్ముడు పోతుందో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

సంచులు అందించాలి..

ప్రభుత్వం మా కష్టాలను అర్థం చేసుకుని సంచులను వెంటనే అందించి పట్టుబడి చేయాలి. ఆకాశంలో మబ్బులతో ఆందోళనకు గురవుతున్నాం. ధ్యాన్యం నింపి తరలించడానికి వెంటనే సంచులు అందించి ఆ వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తే మాకు లాభం ఉంటుంది.

– సంతోష్, గోపాలరావుపేట

చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం సేకరించిన బియ్యం మిల్లు దగ్గర తేమ శాతం తక్కువ ఉందని దిగుమతి కావడం లేదు. తద్వారా లారీలు మా దగ్గరికి రావడానికి, వెంటనే ఎగుమతి అవటం లేదు. సొసైటీలో సంచులు అందించిన వెంటనే ఎగుమతి చేసుకుంటే వర్షాల నుంచి మా బాధలు తప్పిపోతాయి.

– అశోక్, గోపాలరావుపేట

కొనుగోళ్లు చేస్తున్నాం..

ప్రస్తుతం సొసైటీల ద్వారా కొనుగోళ్లు చేస్తున్నాం. పంటలకు వాతావరణం కారణంగా తేమ శాతం తక్కువగా వస్తుంది. తద్వారా లారీలు దిగుమతి కావడం లేదు. అందువల్లనే కొనుగోలు నిలుపుదల చేశాం. రెండు రోజుల్లో కొనుగోలు ప్రారంభించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం.

– సునీల్, సొసైటీ సీఈఓ, పినపాక

స్వేచ్ఛకు ఊపిరి మానవ హక్కులే..



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ స్పందన

మణుగూరుటౌన్: హక్కుల దన్నుతోనే ఆత్మగౌరవం నెలకొంటుందని, ప్రజల స్వేచ్ఛకు ఊపిరి మానవ హక్కులే దన్నుగా నిలుస్తాయని జాతీయ వినియోగదారుల, మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు మండడి సంజీవరావు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కుల పరిరక్షణ, హక్కుల అణచివేత లేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం సాగాల్సిన కృషికి గుర్తుగా డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడెల్లి భవానీ శంకర్ తదితరులు ఉన్నారు.

సమాన హక్కులతో జీవించాలి

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ వివక్ష లేకుండా సమాన హక్కులతో జీవించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన అన్నారు. మంగళవారం మండలంలోని పెదవాగు ప్రాజెక్టు వద్ద ఉన్న (దమ్మపేట) ప్రభుత్వ మహిళా డిగ్రీ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. స్వతంత్రంగా జీవించి, మనుగడను కాపాడుకునేందుకు మానవ హక్కులు ఉపయోగపడుతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సింధుశ్రీ, అధ్యాపకులు సుఫైన్, ఉమా, అరుణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

అశ్వాపురం: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ అశ్వాపురం వారి ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా వైస్ చైర్మన్ గరికపాటి కొండలరావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, న్యాయవాది సింగం శ్రీధర్, కన్నెబోయిన రాము, ముత్తబోయిన నగేష్, గుర్రం నరసయ్య, నాగయ్య, ప్రవీణ్, మనోజ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇళ్లు కేటాయించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి కేటాయించాలని భద్రాద్రి యువజన అభివృద్ధి ఫోరమ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ, తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ రాము మాట్లాడుతూ.. స్థానిక రెవెన్యూ అధికారులు ఎటువంటి ప్రచారం లేకుండా గ్రామసభను నిర్వహించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఇళ్ల లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేయాల్సి ఉండగా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారని, అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నక్క రత్నకుమారి, శాతకుమార్, శివకుమార్, జ్యోతి, పింగిలి రమణ, లక్ష్మి, నాగముత్యం పాల్గొన్నారు.

స్వెట్టర్ల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శిశు గృహం చిన్నారులకు మంగళవారం దాతలు స్వెట్టర్లను అందజేశారు. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు పంపిణీ చేసినట్లు దాతలు తెలిపారు.

నష్టపోయిన రైతును ఆదుకోవాలి



మిర్చితోట వద్ద రైతుతో మాట్లాడుతున్న వినోద్‌రావు, నాయకులు

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో మిర్చిపంట నష్టపోయిన బాధితరైతు ఇమ్మడి శ్రీనును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు డిమాండ్ చేశారు. రావికంపాడు చెందిన ఇమ్మడి శ్రీను అనే కౌలురైతు మూడు ఎకరాల్లో మిర్చి సేద్యం చేయగా, ఏపుగా ఉన్న పంటపై గుర్తు తెలియని దుండగులు కలుపుమందు పిచకారీ చేశారు. దీంతో తోటంతా వడలిపోయింది. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న వినోద్‌రావు మిర్చితోటను మంగళవారం సందర్శించారు. బాధితరైతు కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం అందించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. ఫసల్ బీమా యోజన పథంకం రాష్ట్రంలో అమలు చేస్తే ఇలాంటి రైతులకు ఆర్థిక చేయుత అందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లమోతు రఘుపతిరావు, జటంగి కృష్ణ, బోగి కృష్ణ, దేవిబాల కిరణ్‌శర్మ, మరకాల రవీందర్‌రెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి, గుగులోతు మోహన్‌నాయక్, టి.సురేష్, బాల వెంకటరెడ్డి, విజయ్‌భాస్కర్, బాబు పాల్గొన్నారు.

'కథాకేళి'తో కొత్త ఆలోచనలు



కథాకేళిలో కథ చెబుతున్న విద్యార్థిని

అశ్వారావుపేటరూరల్: పాఠశాలల్లో 'కథాకేళి' కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, నైపుణ్యాలు పెరుగుతాయని కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.హరిత అన్నారు. మంగళవారం అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల్లో కథాకేళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో వినోదాన్ని అందించడంతోపాటు వారిలో కొత్త ఆలోచనలు వస్తాయన్నారు. కథలు చెప్పడం ద్వారా విలువల గురించి తెలుసుకోవడం, భాషా నైపుణ్యం, ఆలోచన శక్తి పెరుగుతాయని అందుకే ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలను ఎంపిక చేసి బహుమతులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, బాబురావు, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

సమస్యలపై తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మణుగూరు తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేక అధికారి వి.రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి పంచాయతీలోని అర్హులైన పేదలకు కేటాయించాలన్నారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్.. సమస్యలను జిల్లా కలెక్టర్‌కు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు అక్కి నర్సింహారావు, మాజీ ఉపసర్పంచ్ తడికమల్ల ప్రభుదాస్, పంచాయతీ అధ్యక్షుడు లేళ్ళ కృష్ణ, ప్రధాన కార్యదర్శి బోయిల్ల రాజు, మందారి సతీష్, నడికొప్పుల సిద్దు, కారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని కుర్వాపల్లి కొత్తూరు గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. తుమ్మలచెరువు గ్రామానికి చెందిన కాలం అజయ్ బైక్‌పై మొండికుంట వైపు వస్తుండగా కుర్వాపల్లి కొత్తూరు వైపు వస్తున్న బైక్ మొండికుంట–తుమ్మలచెరువు రహదారిపై ముత్యాలమ్మ గుడి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్, టాటా మ్యాజిక్ తప్పించబోయి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో అజయ్‌కు గాయాలవగా.. భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

గురుకులాల్లో పరిశీలన

అశ్వారావుపేటరూరల్: డల కేంద్రంలోని బీసీ బాలికల, బాలుర గురుకులాలను మంగళవారం కాంగ్రెస్ ఓబీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హారికనాయుడు పరిశీలించారు.

తొలుత బాలికల గురుకులంలో మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి వసతులను పరిశీలించిన ఆమె.. మధ్యాహ్న భోజన నిర్వహణపై సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, బీసీ బాలురు గురుకులంలో పరిశీలించి మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం



చంద్రుగొండ: జ్యోతిప్రజ్వలన చేస్తున్న తహసీల్దార్ సంధ్యారాణి



దమ్మపేట: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు, వీక్షిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, డీటీ తదితరులు



దుమ్ముగూడెం: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ సమ్మయ్య



అన్నపురెడ్డిపల్లిలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు వైద్యశాల అవరణలోని క్రీడా మైదానంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను మంగళవారం ఎంఇఓ సున్నం సమ్మయ్య ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లోని అర్హత ఉన్న క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ మండల స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు. మండలంలోని పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమంలో సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలను, మంగళవారం ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎంపీడీఓ, స్థానిక మండల అధికారులతో కలసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. క్రీడల వలన శారీరక అలసట కలిగి తద్వారా శరీరంలోని పలు రుగ్మతలను చికిత్స లేకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, డీటీ వాణి, ప్రిన్సిపాల్ వీరాస్వామి, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: స్థానిక సెయింట్‌జోసఫ్ పాఠశాలలో నిర్వహిస్తున్న మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను తహసీల్దార్ సంధ్యరాణి మంగళవారం జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు ఓ భాగమన్నారు. ప్రతిభ ఉన్న వారం రాణిస్తే పైస్థాయికి ఎదగవచ్చన్నారు. మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయిని పీడీ సృజన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంఈఓ సత్యనారాయణ, ఎస్‌ఐ శివరామకృష్ణ, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు వాజీద్, లత, మధు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లి మండలస్థాయి సీఎంకప్ క్రీడాపోటీలను ఎంపీడీఓ మహాలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ఆటల పోటీలతో ఆనందంతోపాటు ఆరోగ్యం లభిస్తుందని మండల ప్రత్యేకాధికారి రమేశ్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సీఎం కప్ పోటీలను మంగళవారం ఆయన రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందేందుకు క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రేవతి, ఎంఈఓ లక్ష్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ సర్పం, కారం సుధీర్, నాయకులు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం



అశ్వారావుపేటరూరల్: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే మెచ్చా, నాయకులు



మణుగూరురూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

హైదరాబాద్ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మార్పులు చేర్పులు చేసి ప్రతిష్ఠించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పలు చోట్ల నిరసనలు వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి పాత విగ్రహాలు, చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఎంతోమంది ఉద్యమకారులు, ప్రజల అభీష్టం మేరకు కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేశారని, నేడు సీఎం రేవంత్‌రెడ్డి మార్పులు చేసి ప్రతిష్ఠించడం సరైంది కాదని ఈ సందర్భంగా నాయకులు విమర్శించారు.

మణుగూరురూరల్: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, నాయకులు వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ సునీల్, నాయకులు పూర్ణచంద్రరావు, జయప్రేమ్, నరసింహులు, ఏడుకొండలు, రామకృష్ణ, అనిల్, కృష్ణ, బాబి, ప్రదీప్, శివకుమార్, సీతామహాలక్ష్మి, లక్ష్మి, సలోమి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్ సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, నాయకులంతా కలిసి క్షీరాభిషేకం చేశారు. నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, సంపూర్ణ, మాజీ సర్పంచ్‌లు నారం రాజశేఖర్, కలపాల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్ల: చర్లలో తెలంగాణా తల్లి చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోల్ పవన్‌కుమార్, మండల మాజీ అధ్యక్షుడు సోయం రాజారావు, సీనియర్ నాయకుడు ఎస్‌డి.అజీజ్, మాజీ సర్పంచ్ కారం కన్నారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కుంజా నాగేశ్వరావు, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి బట్టా విజయరావు నాయకులు పాల్గొన్నారు.

ములకలపల్లి: బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలంగాణా తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, నాయకులు బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, శనగపాటి మోహరమణి, సీతారాములు, పుష్పాల సాయి, సున్నం బాబూరావు, బైటి రాజేశ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం వద్ద ఉన్న తెలంగాణతల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మెడా మోహన్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ, చాపలమడుగు రామరాజు, అంజన్‌రావు, నరుకుళ్ళ వాసు, రమేష్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ కోకన్వీనర్ కణితి రాముడు, జానీపాషా, నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, జిలకర గంగరాజు, తంతరపల్లి వెంకటేశ్వర్లు, వాగేకృష్ణ, పూసం రాజేష్ పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



చర్ల: తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ..



ములకలపల్లి: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం